*శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!*
*సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!*

# గురుకృప

గురోపినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా! సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతి హిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా
భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కళ్యాణ కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:3 సంచిక:10 త్రైమాసిక పత్రిక మార్చి - 2000

## సాయివంటి దైవంబు లేడోయి లేడోయి !

ప్రజలందరి నోట సాయి నామం
పలకాలి! సర్వత్రా సాయి
రూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి! సాయిపద
రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద
వీచికల్లా సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ
సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన మనసులు
మత్తెక్కాలి! సాయి
ప్రేమామృతధారలు అంతటా
నిరంతరం వర్షించాలి!



సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

ఆ ప్రేమామృత ధారలలో
తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల
మత్తులో ఆనందంగా నర్తిస్తూ
'సాయి వంటి దైవంబు లేడోయి!
లేడోయి!!' అని అందరూ ఏక
కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం,
ఆకాంక్ష! అదొక మధుర
స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం
కోసం శ్రీ సాయినాథుని
అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం
చేయగలిగింది,
చెయ్యవలసింది.

---

### ఈ సంచికలో


1. సాయివంటి దైవంబులేడోయి!లేడోయి
2. ఉన్నమాట - అనుకున్నమాట - గురు బంధువులు
3. సర్వ మత సమరస సారం - శ్రీసాయిమతం - డా|| సాయినాథుని శరత్ బాబూజీ
4. గురువుగారి ఆశీస్సులతో తెనాలిలో సత్సంగం ఏర్పాటు - టి. నాగేశ్వరరావు.
5. బాబా సూట్ కేసా!... ఈ కేస్ గురువుగారిది - చీదెళ్ళ హృషీకేశవరావు
6. చెప్పనలవికాని బాబూజీ మహిమలు - లక్కరాజు
7. వ్రాసేకొద్దీ ఉంది చరిత్ర - రాశులకొద్దీ వాసిగల దత్తము - అద్దంకి శివరాం
8. అయాచితంగా అందుకొనేదే అనుగ్రహం - డా|| ఏస్. సాయివరప్రసాదరావు

## ఉన్నమాట - అనుకున్నమాట

ఇది ప్రత్యేక సంచికకాదు కానీ ఈ సంచికలో ఒక ప్రత్యేకత మాత్రం ఉంది.

అనంతం - అపారం "గురుకృప". అవధిలేనిది ఎల్లలు లేనిది "గురుకృప" ఎవరిపై సద్గురువుయొక్క ప్రసన్న వీక్షణం ప్రసారమవుతుందో... బోయవాడు వాల్మీకి అయినట్లుగా అసామాన్య భావాలకు కవితాకుసుమాలను, అక్షరార్చనగా సమర్పించగలుగుతాడనటానికి నిదర్శనాలైన స్వీయ అనుభవాలు ఈ సంచికలో ప్రత్యేకత.

"మనం సాయితో అనుబంధాన్ని పెంచుకోవాలి. ఎల్లప్పుడూ సాయినామం, సాయిపారాయణం చేస్తూ సాయిభావనలో ఉండాలి. వీలైనంతవరకు షిరిడీవచ్చి సాయిని దర్శించి కాలమంతా గురుస్థాన్ లో గడపాలి. అందరిలోను సాయిని చూడాలి. సాయితో ఋణానుబంధాన్ని పెంచుకోవాలి. తగవులాటలు, పోట్లాటలు సాయికి గిట్టవు. ఎవ్వరినీ పల్లెత్తుమాట అనకూడదు" అనే సాయి బోధనలను అవగతం చేసుకున్న సాయి సాధకులైన శరద్బాబూజీని గూర్చి శ్రీ లక్కరాజుగారు వివరించిన వ్యాసం ఈ సంచికకు ఒక ఆణిముత్యమైతే, మార్పుకు, ఆదర్శకతకు ఆలంబనమైన సత్సంగకేంద్రం శరద్బాబూజీ సలహాతో, ఆశీర్వచనంతో తెనాలిలో ప్రారంభించబడిన వైనాన్ని వివరించిన శ్రీ నాగేశ్వరరావుగారి రచన వివిధ సత్సంగ కేంద్ర స్థాపకులకు, ఉత్సాహకులకు ప్రోత్సాహకులకు ప్రేరేపణగా నిలిచిపోతుంది.

నా దృష్టిలో "బాబా, గురుజీ వేరువేరుకాదు. ద్వంద్వ భావంలేదు. బాబా, గురూజీ ఒక్కరే అన్న నా అనుభవపూర్వకంగా స్వప్న సందేశం ద్వారాకూడా పొందాను. నా దృష్టిలో జరిగే ప్రతి సంఘటన, అది చిన్నదైనా, పెద్దదైనా పూర్తిగా గురూజీ అనుగ్రహంతోనే జరుగుతుందని గట్టిగా చెప్పగలను" అని గురువుగారు సన్నిధిలో అనుక్షణం ఉంటూ అనేకానేక అనుభవాలను పొందిన శ్రీ శివరాం గారి వ్యాసం గురుబంధువుల గురుభక్తిని ఉద్దీపింప చేస్తుంది.



భవిష్యత్తులో చరిత్రకారులెవ్వరైనా వ్రాయబోయే "శరత్ చరిత్ర" రచనకు మన 'గురుకృప' లోని వ్యాసాలు మార్గదర్శకాలు, మణి మకుటాలు కాగలవు అనడంలో అతిశయోక్తిలేదు.

ఈ విశేష సంచికలో వున్న సశేష రచనలను చదివిన సాధకులు జూన్ సంచికకోసం ఎదురు చూస్తూ గురుస్మరణలో గడపగలరని ఆశిస్తూ...

గురుబంధువులు

## సర్వమత సమరసపారం - శ్రీ సాయిమతం

(డిశంబరు 1989 సాయిపథం నుండి)

మానవునిలో పశు సంస్కారాలను సంస్కరించి మానవత్వాన్ని మేల్కొలిపి, క్రమంగా దైవస్వరూపునిగా రూపొందించడమే మతం యొక్క ముఖ్య ఉద్దేశం, ప్రయోజనం. వివిధ దేశకాలాలలో ప్రభవించిన సద్గురు మూర్తులు, ప్రవక్తలు ఆయా ప్రయోజనాన్ని సాధించడానికి ఆయా దేశకాలాలలోని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణమైన ధర్మాలను, పద్ధతునలు ఏర్పరచారు. కానీ కాలక్రమంలో మానవునులోని అజ్ఞానం, స్వార్థం, మతానికీ - మతానికీ, మనిషికీ - మనిషికీ మధ్య 'అడ్డుగోడలు' నిర్మించి, మత విద్వేషాగ్నిని రగిలించి

మానవత్వపు మనుగడకే జీవనకల్పమైన మతాన్ని ఆ మత విద్వేషాగ్నిలో సమిధలుగా చేసింది. పర్యవసానం... ఈనాడు మనం చూస్తున్న కల్లోలాలు, కరడుగట్టిన మత మౌఢ్యం, పాశవిక హింసావాదం వీటన్నింటి వెనుక మంటగలుస్తున్న కనీసపు మానవతా విలువలు, మానవునిలో సమతను పెంపొందించి మనిషిని దివ్యునిగా రూపొందించగల ఒకే మార్గమయిన మతమే. తద్విరుద్ధమైన పాశవిక పైశాచిక ప్రయోజనాలకు సాధన కావడమే నిజమైన ధర్మగ్లాని.

సమాజంలో ఈ 'ధర్మగ్లాని' ముదిరి శృతి మించే సమయంలో, మానవాళికి సన్మార్గాన్ని చూపడానికి అవతార పురుషులు ఉదయిస్తారు. ఈ యుగంలో పైన పేర్కొన్న విధమైన ధర్మగ్లానిని మాన్పి శుభ్ర మార్గంలో నడిపించడానికి అవతరించిన యుగపురుషుడు శ్రీ సాయినాథుడు.

శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణ మహర్షి మొదలైన మహాత్ములు సర్వమతాల సారం ఒకటేనని, భేదాల కతీతంగా వున్న ఆధ్యాత్మికానుభూతే పరమ సత్యమనీ బోధించినా, వారు జన్మతః ఒక మతానికి చెందిన వారవటంచేత ఇతర మతస్తులకు వారి హితవు అంతగా చెవికెక్కలేదు. ఆ మహాత్ములు ఏ మతానికి చెందారో ఆ మతానుయాయులు కూడా, వారి దివ్య సందేశాన్ని ఆచరించడానికి బదులు, అంతటివారు 'మా మతానికి' చెందినవారని చాటుకొని గర్వించడానికి మాత్రమే ఉపయోగించుకోవడం చూస్తున్నాం.

అందుకే, శ్రీ సాయి తమ జన్మ వివరాలను ఒక దేవరహస్యంగా ఉంచారు. బాబా హిందువులకు హిందువు, ముస్లిములకు ముస్లిం. సర్వమతాలలో శ్రేష్ఠ లక్షణాలు ఆయనలో మూర్తీభవించి గోచరిస్తాయి. ఈ సామరస్యం ఎంత అద్భుతంగా ఆయనలో ఇమిడిందంటే, ఆయా మతాల సాంప్రదాయక ఛాందసవాదులు కూడా ఏ మాత్రం సంకోచం లేకుండా ఆయనను 'తమవాడిగా' అనుకొనేంతగా కనిపిస్తుంది. ఇది మానవాళి ఆధ్యాత్మిక చరిత్రలోనే అపూర్వం. మత విద్వేషాగ్నిలో సమిధలు అవుతున్న మనలోని అరిషడ్వర్గాలను, స్వార్ధపరత్వాన్ని తమ జ్ఞానాగ్ని అనే 'ధుని' లో వేసి భస్మంచేసి, దానికి ఫలమైన మహిమాన్వితమైన 'ఊది'ని మనకు ప్రసాదంగా ప్రసాదించారు - శ్రీ సాయిబాబా. శ్రీ సాయిలోని ఈ అద్భుత తత్వాన్నే 'గురుదేవ గురుదేవ దత్తావధూతా' అని హారతి గీతం. ఒక వైపు శ్రీ సాయిని దత్త స్వరూపంగా దర్శిస్తూనే, మరోవైపు "మోమిని జన్మని లోకాతారియలే" అని కీర్తిస్తున్నది.

శ్రీ సాయిబాబా అవతార కార్యంలో ప్రధాన అంశమైన ఈ సర్వమత సమరస భావాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించనిదే మనం ఎప్పటికి సాయి భక్తులము అవలేము. శ్రీ సాయి తమ మతం కబీరు మతమనీ, కులం దైవమనీ, (పర్వర్దిగర్) చెప్పారు. అలాగే శ్రీ సాయి భక్తులందరూ తమ మతం (సర్వమతసారమైన) సాయి మతమనీ, కులం సాయి కులమనీ సగర్వంగా నిర్ద్వందంగా చెప్పుకొనగలగాలి. సాయిమందిరాలను మతభేదాల కతీతంగా నిర్వహించగలగాలి. అప్పుడే శ్రీ సాయి తమ జీవిత పర్యంతం ఆచరించి, ఆదేశించిన ఉన్నత ఆదర్శాన్ని కొంతవరకైనా అనుసరించగలిగి శ్రీ సాయి కృపకు పాత్రులు కాగలగాలి.

ఇది బ్రాహ్మణ మసీదు. ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్ర మార్గాన నడిపించి చివరికంటా గమ్యం చేరుస్తాడు అల్లా మాలిక్ హై - శ్రీ సాయిబాబా

పైన చెప్పిన బాబా పలుకులపై మీ స్పందనలను ఆహ్వానిస్తున్నాం - గురుకృప
మాకు చేరవలసిన ఆఖరుతేది ది||25-5-2000

## గురువుగారి ఆశీస్సులతో తెనాలిలో సత్సంగం ఏర్పాటు

1992 జనవరి 5న డి.ఎస్.కళ్యాణ మండపంలో "శరద్బాబూజీ" నిర్వహణలో సాయి పూజోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. గుంటూరుకు సంబంధించిన గురుబంధువులు ఆహ్వానించగా తెనాలి నుండి మేము వంద మందికిపైగా వెళ్ళాము. గురువుగార్ని మేమంతా దర్శించుకొని వారితో అన్నాం "తెనాలిలో సత్సంగం పెట్టుకుంటామని". గురువుగారు ఆశీర్వదించి "సాయిపథం" వ్యాసాల పుస్తకాలను రెండింటిని ఇచ్చి "రాజకీయంగానే గాక తెనాలి విప్లవాత్మకమైన మార్పులకు ఆలవాలం. అలాంటి తెనాలిలో మీరు ఏర్పాటు చేసుకొనే సత్సంగవల్ల మీలోనూ ఎంతో మార్పు కలిగి ఒక ఆదర్శవంతమైన సత్సంగ కేద్రం ఇక్కడ నుండి విరాజిల్లబోతుంది" అన్నారు. వారి వాక్కు అమోఘం. అలానే చిరకాలంలోనే తెనాలి, తెనాలి పరిసర ప్రాంతాలలో నూతనంగా సత్సంగ కేంద్రాలు నెలకొన్నాయి.

గురూజీని దర్శించుకొని, గురూజీ సత్సంగం విని, గురూజీ ఆశీర్వచనం తీసికొని ఆనాటి రాత్రి గం||11-30 తరువాత గుంటూరు నుండి బయలుదేరాము. దారిలో మాకు అనుమానం కలిగింది. గం||12-00 తెనాలికి వెళ్ళే ఆర్.టి.సి. బస్సు ఉంటుందా అని. అప్పుడు సాయివరప్రసాదరవుగారు 'తప్పకుండా మన ప్రయాణం సుఖాంతంగా సాగేందుకు గురువుగారు ఏదో రకంగా ఏర్పాటు చేస్తారన్నారు'. పది నిమిషాల్లో బస్సు వచ్చింది. గం||9-00లకు బయలుదేరవలసిన బస్సు ఏదో లోపం కారణంగా గం||12-00లకు వచ్చింది. మేమంతా బస్సులో బాబా నామం జపిస్తూ ప్రయాణం చేసాము. ఆర్.టి.సి. బస్సులో మేము తప్ప ఇంకెవ్వరూ లేరు. ఇదో విచిత్రమైన వింత అనుభవంగా మేమంతా చెప్పుకున్నాం. ఎందుకంటే ఉన్నవారందరూ గురుబంధువులేతప్ప ఇంకెవ్వరూ లేరు. అలా మా కోసమే బస్సును గురువుగారు అనుగ్రహించారు.

తరువాత తెనాలిలో 1992 జనవరి 12న సత్సంగ కేంద్రాన్ని గురువుగారి పేర మొదటిసారిగా బ్యానరుకట్టి ప్రారంభించాం. (ఆ తరువాత గురువుగారు తన పేరిట ఏర్పాటు చేసిన దానిని ఆమోదించక బాబా పేరున ఉండాలని చెప్పారు). 'సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం'గా మార్చాము. మేమంతా షిర్డీకి వెళ్ళాము.

మొదటి రోజున బాబాను దర్శించుకొని, అదేరోజు రాత్రి గురుస్థానంలో ప్రదక్షిణాలు చేస్తున్నాం. మా ధ్యాసలో మేమున్నాం. గురువుగారు కూడా గురుస్థానానికి వచ్చి ప్రదక్షిణాలు చేసారు. గురువుగారు వచ్చిన తరువాత అంతకు ముందు అలసిపోయిన మేమంతా అలుపు అనేది దూరమై వారితోపాటు ప్రదక్షిణాలు చేసే మహదావకాశం మాకు లభించింది. అలసిపోతున్న మాకు అలుపనేది రాకుండా గురువుగారి దయవల్ల జరిగింది. తెల్లవారేదాకా వారితోపాటు గురుస్థానంలో ప్రదక్షిణాలు చేయడమంటే సామాన్యమైన విషయం కాదుగదా!

ఆ మరుసటి రోజు తెనాలికి బయలుదేరాం. రిజర్వేషన్ లేదు. మన్మాడ్ స్టేషన్‌లో జనం కిటకిటలాడుతున్నారు. ఏ బోగీ ఖాళీగాలేదు. ఒక బోగీలో ఎవ్వరూలేరు. బాబాను, గురువుగారిని ప్రార్థించుకున్నాము. ఈ బోగీలో అవకాశమిప్పించమని. ఆ తరువాత టి.సి.ని అడగ్గా మా ముగ్గుర్నీ లోపలకు పిలిచాడు. అది ఔరంగాబాద్ కోటా అని తెలిసింది. క్రితం రోజు రాత్రంతా గురువుగారితో గడిపిన మాకు నిదుర లేనందువలన త్వరగా నిద్రలోకి జారిపోయాం. తెల్లవారి లేచి చూచేసరికి మేము ఔరంగాబాద్ స్టేషనులోనే ఉన్నాం. జరిగిన విచిత్రమేమిటో మాకు నింపాదిగా తెలిసింది. మన్మాడ్ నుంచి బయలుదేరిన తరువాత రైలు ఒక గంటన్నర ప్రయాణించి ఆగిపోయింది. నిద్రలోకి జారిపోయిన మేము దీన్ని గమనించలేకపోయాము. అక్కడే చాలాసేపు ఆగింది. ఆ తరువాత ఔరంగాబాద్ చేరేసరికి మాకు చాలినంత నిద్రపోయాము. ఔరంగాబాద్ కోటాలో ఎక్కవలసినవారు ఎక్కారు. ఈ లీలను మేము ఎన్నోసార్లు ఎంతో మందికి చెప్పుకున్నాము.

1993 తెనాలిలో సాయిపూజోత్సవాలను గురూజీ ఆశీర్వాదంతో ఆరంభించాము. ఏ పనికొరకు వెళ్ళినా, ఎవర్ని కలవాలన్నా, ఏ పని చేయాలన్నా, మా నిర్వాహకులకు శ్రమలేకుండా కార్యక్రమములు వాటంతటవే జరిగిపోయేవి. అన్నింటికన్నా ఆనందించే ఆంశమేమంటే అదివరకంతా శరద్బాబుగారని గురుబంధువులు సంబోదించేవారు. శరద్బాబు నుండి "శరద్బాబూజీ" అని పిలవటం తెనాలికి వచ్చిన తరువాతనే జరిగింది. ఇదంతా మా సత్సంగం మహిమని మేము తలంచాము. బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. గురువుగారితో పాటు షిరిడీకి చెందినవారు బాబాతో అనుబంధము కలిగిన కుటుంబాలవారు మా సాయి పూజోత్సవాలలో పాల్గొన్నారు. అంత మంది షిరిడీ నుండి తొలిసారిగా మా సత్సంగానికి రావడం అన్నది గురువుగారి అనుగ్రహమే కదా!

తెనాలిలో గురువుగారికి పూర్ణకుంభముతో స్వాగతమివ్వాలనుకున్నాం. కానీ కుదరలేదు. ఆ సన్నివేశం రెండవ రోజున పౌన్నూరులో జరిగింది. ఆ దృశ్యం చూడగానే మా అందరికి ఆనందము కలిగింది. మమ్మల్ని చూసి గురువుగారు చిరునవ్వు నవ్వారు. చూచారా మీ కోర్కెను బాబా ఎలా తీర్చారో అన్నట్లుంది ఆ చిరునవ్వు. (మరికొన్ని వివరాలు వచ్చే సంచికలో)

27-5-96

టి.నాగేశ్వరరావు, తెనాలి.

## బాబా సూట్‌కేసా!... ఈ కేస్ గురువుగారిది

సాయిబాబాకు, పూజ్య గురువుగారికి నా సాష్టాంగ ప్రణామములు. నా పేరు హృషీకేశవరావు. మాది చేబ్రోలు. నేను మా అమ్మాయి గురుబంధువులతో ది|| 30-12-97న తెనాలి నుండి షిర్డీకి బయలుదేరినాము. జనవరి 1న గురువుగారి దర్శనం చేసుకున్నాము. గురువుగారి ఆశీస్సులు తీసుకొని తిరిగి వస్తున్నాము. సికిందరాబాద్ లో మా అందరి సూట్‌కేసులు ట్రైనులో పెట్టాము. అన్ని సూటుకేసులు పెట్టామనే అనుకున్నాము. ఇంతలో ఎవరిదో సూట్‌కేసును మరచిపోయామని తెలిసింది. అది మా సూట్‌కేసని తెలిసింది. మేము వచ్చిన తరువాత మూడోరోజున ఆదివారం తెనాలిలో జరుగుతున్న కృష్ణ మాస్టారి సత్సంగానికి వెళ్ళాము. సూట్‌కేస్ విషయం అద్దంకి మంగారావుగారితో చెప్పాము. ఆయన ఈ విషయం గురించి గురువుగారికి ఒక ఉత్తరం వ్రాయమని చెప్పారు. కానీ మేము ఆ సూట్‌కేసు దొరకదనే అభిప్రాయంతో గురువుగారికి ఉత్తరం వ్రాయలేదు. మరల ఆదివారం సత్సంగానికి వెళ్ళాము. అప్పుడు మంగారావుగారు గురువుగారికి ఉత్తరం వ్రాసారా అని అడిగారు. నేను వ్రాయలేదండి ఈ రోజు తప్పకుండా వ్రాస్తానని అన్నాను. ఇంటికొచ్చిన తరువాత మేము షిర్డీ నుండి చేబ్రోలు తిరిగి వస్తుంటే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మా సూట్‌కేస్ పోయినదని గురువుగారికి ఉత్తరం వ్రాసాను. ఉత్తరం వ్రాసిన రెండురోజులకు సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ నుంచి మా సురేఖ పేరుతో ఉత్తరం వచ్చింది. ఉత్తరంలో "మీ సూట్‌కేసు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి వచ్చి తీసుకెళ్ళవలసినది" అని ఉంది. మా అమ్మాయి అప్పట్లో తెనాలిలో హిందీ పండిట్ ట్రైనింగ్ తీసుకొంటున్నది. మా అమ్మాయి సీజన్ టికెట్ సూట్‌కేసులోని పర్సులో ఉంది. దాని ఆధారంగా ఉత్తరం వచ్చింది. మా ఆశ్చర్యానందాలకు అంతులేదు. ఉత్తరం వచ్చిన తరువాత సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌కి ఫోన్ చేసినాను. నేను వచ్చి సూట్‌కేస్ తీసుకుంటానని చెప్పగా వారు ఏ సూట్ కేస్ "బాబా సూట్‌కేసా?" అన్నారు. ఆ సూట్‌కేస్‌లో అన్నీ బాబా ఫోటోలు, గురువుగారి ఫోటోలు, బాబా డాలర్స్, స్టిక్కర్స్, కీచైన్స్ ఉన్నాయి. తరువాత రెండు రోజులకు సికిద్రాబాద్ రల్వే పోలీస్‌స్టేషన్ కి వెళ్ళినాము. ఫలానా సూట్‌కేస్ మాది అని చెప్పినాము. "మీ సూట్‌కేస్ లో బాంబు ఉందేమోనని మూడురోజులు కాపలా పెట్టించాము. మూడు రోజుల తరువాత బాంబు శక్తి క్షీణిస్తుందని మూడు రోజుల తరువాత సూట్‌కేసు కి తాళం వేయనందువలన తెరచి చూసినాము. అందులో మీ అడ్రస్ దొరికింది. ఆ అడ్రస్‌కి ఉత్తరం వ్రాసామని చెప్పారు ఎస్.ఐ.గారు, నా దగ్గరున్న సాయిబాబా బేడ్జిచూచి ఆ బేడ్జిలో బాబా క్రిందనున్న గురువుగారిని చూపి ఈయనెవరని అడిగారు. గురువుగారి గురించి చెప్పాను. ఆయన నేనుకూడా షిర్డీ వెళ్తానని చెప్పినారు. ఈ విధంగా మా

సూట్‌కేస్ కి మూడురోజులు కాపలా ఉంచి మరీ ఇప్పించారు గురువుగారు. పోయిన సూట్‌కేస్ దొరుకుతుందని అసలు ఊహించనే ఊహించలేదు. అటువంటిది గురువుగారికి ఉత్తరం వ్రాసిన రెండో రోజునే మాకు దొరికిందని ప్రత్యుత్తరం వచ్చింది. సూట్‌కేస్ లోని వస్తువులన్నీ అలానే ఉన్నాయి. ఒక్కటి కూడా పోలేదు. ఈ మా మొదటి అనుభవం మా భక్తిని పెంచి గురువుగారికి యింకా దగ్గరయేటట్లు చేసింది. ఆ రోజు నుంచి మేము ప్రతిపనీ బాబాకు గురువుగారికి విన్నవించుకొని చేస్తున్నాము.

26-01-2000, చేబ్రోలు — చీదెళ్ళ హృషీకేశవరావు.

## చెప్పనలవికానివి బాబూజీ మహిమలు

తెనాలి సాయిపూజోత్సవ కార్యక్రమములకు వచ్చిన డా|| సాయినాథుని శరత్ బాబూజీగారి విశిష్టత, సాయిపథంలో వారి కృషి, ఇతర సాయిబంధువులద్వారా విని ఉండటంవల్ల, వారిని కలిసి మారీసుపేటలో శ్రీ దత్తసాయి ఆలయ నిర్మాణం జరుగుతున్నదని కావున ఒక్కసారి మీరువచ్చి చూచి ఏదైనా సూచనలు ఉంటే చెప్పమని వారిని కోరాను. శ్రీ నారాయణరావుగారిని పిలిపించి, సమయం నిర్ణయించుకొని, ఆ మధ్యలో ఎన్నో అవరోధాలు కలిగితే, అవన్నీ అవతలికి త్రోసి మారీసుపేట ఆలయానికి వచ్చారు. సలహాలు ఇవ్వటమేకాదు అక్కడ ఉన్న, నిర్మాణ సమయంలో పెట్టుకొన్న సాయి పటానికి మూడూ హారతులు ఇచ్చారు. వారు హారతి ఇచ్చిన విధానం, ఇప్పటికీ నాలుగేళ్ళు అయినా ఇంకా కళ్ళకు కట్టినట్లుగా కనపడుతున్నది. అదే మొదటిసారి ఆయన గురించి నా మనస్సులో ఆలోచనలు చోటుచేసుకున్నాయి.

దత్తసాయి ఆలయానికి రాబోయే ముందు జరిగిన సంఘటనల గురించి, ఇప్పటికీ మొన్న మొన్న కలసినప్పుడుకూడా చెపుతుంటే, చిరాకు పడవలసిన విషయంకూడ చిన్మయానందంగా చెప్పగలిగే శక్తి ఏ ఉత్తమసాధనవల్ల పొందగలిగారో, ఈ విశిష్టమైన సాయిసాధకుడు! అని అనిపిస్తుంది ఆరాధనా భావంతో.

1993 మే 30వ తేదీన శ్రీ దత్తసాయి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వారి చేతులమీదుగానే జరిగింది. "ఎవరు నేర్పారమ్మ కోయిలమ్మకు రాగాలు" అనో ఏదో ఒక పాట గుర్తుకు వస్తున్నది. వేద పండితులకు దీటుగా ఆ కార్యక్రమం ఆయన చేతులమీదుగా జరిగిన విధానం మనస్సుకు గుర్తుకు వచ్చినప్పుడల్లా - సాయి ఆశీర్వచనములు పొందిన ఆయన ముద్దు బిడ్డలకు ఇదొక విశేషమా అనిపిస్తుంది.

*"శ్రీ సాయినాథుని ప్రతి శ్వాసలోను నిలుపుకున్న మరొక్క మహనీయుడుగా ఆయన కనిపించాడు."*

ఒక దశలో ఆలయ నిర్మాణ కార్యక్రమాలు మందకొడిగా సాగుతున్నప్పుడు వారిని అడిగాము. ఆయన షిర్డీ నుంచి కబురు చేశారు. 'సత్సంగాలు మొదలు పెట్టండి సత్ఫలితాన్ని పొందుతారు' అని అన్నారు. సాయివరప్రసాద రావు ఆలయంలో సత్సంగాన్ని ప్రారంభించారు. ఆ ఆనందం, ఫలితాలు పొందిన తరువాత ఆయన ఆదేశం యొక్క విలువ తెలిసింది. ఇప్పుడు ఆయన మాకు అందించిన దీవెన అని భావిస్తున్నాము. నిరాటంకంగా నాలుగు సంవత్సరాల నుంచీ సత్సంగం జరగటానికి మన కృషికి ఆశీర్వచనము ఉందికదా. ఆచరిస్తున్నది మన మని అనిపించినా *ఆదేశించింది డా|| బాబూజీ, ఆశీర్వదించింది సద్గురు సాయినాథ్ మహరాజ్ - సాయిపథంలో మనం నడవడానికి చేయూతనిస్తున్న మార్గదర్శి ఆయనే*. శ్రీమతి రేటూరి కంచెమ్మగారి కరుణవలననే 42 సంవత్సరాల క్రితం 'సాయి'ని ఆరాధించటం నేర్చుకున్నాను. నాకు సాయితత్త్వంలో ఓనమాలు నేర్పింది ఆవిడే - తరువాత రామలింగేశ్వరపేట సాయి ఆలయంలో సత్సంగాల పరిచయం - కాని, సత్సంగం చేయటం అనే వంకతో ఆధ్యాత్మిక చింతనకు బాటవేసి నడిపిస్తున్న డా|| సాయినాథుని శరత్ బాబూజీకి ఏవిధంగా నా కృతజ్ఞతలు అందజేయగలను?

ఆయన చెప్పిన సాయిబాటలో నడవటంతప్ప - "నన్ను షిర్డీకి తీసుకొనివచ్చి సాయిని పరిచయం చేసిన వారికి నేనెంతో ఋణపడి ఉంటానని", అన్నా సాహెబ్ చోల్కర్ చెప్పినట్లు -

ఒకసారి దత్త దీక్ష తీసుకున్నాను, స్వంత ఆలోచనే - నా దీక్ష విరమణకు రెండు రోజులు ముందుగా శ్రీశైలం వెళ్ళాను - అక్కడ నాకు మన తెనాలి సత్సంగ కేంద్రాల కన్వీనర్ శ్రీ నరసింహారావు, శ్రీ బాబు, ఇతర సాయిబంధువులు కలిశారు - శ్రీ శరత్ బాబూజీగారు ఉండే ప్రదేశంలో దగ్గరగా నారాయణరావుగారు, గుప్తాగారు, శివరాంగారు మరితర సాయిబంధువులు దిగారట. అక్కడ రూమ్స్ ఖాళీ లేకపోతే వేరే హాస్టల్ లో దిగాము మేము. సాయంత్రం మహానంది నుంచి డా|| బాబూజీ వస్తున్నారని తెలిసింది. నేనూ, పళ్ళకొట్టు ప్రసాద్, బాబు, నరసింహారావుగార్లు ఒక గోడమీద కూర్చొని మాట్లాడు కుంటున్నాము. ఆ హాస్టల్లో మనకు రూము దొరకలేదు కాబట్టి, మరి మనకు ముందుగా దర్శనం కాదేమో అన్నాను. వెంటనే నరసింహారావు, ప్రసాదు, బాబుగార్లు ఒక్కసారి అన్నారు "లేదు తప్పని సరిగా ముందు మనకు దర్శనం అవుతుంది" అని. ఇంతలో ఒక మారుతీకారు మా ముందుగా వెళ్ళి పది గజాల దూరంలో ఆగటం, అందులో గురువుగారు దిగటం జరిగింది. 'అదిగో అదిగో గురువుగారు' అంటూ పరుగెత్తి వెళ్ళాం. ముందు దర్శనం మాకే అయింది. ఎంతో ప్రేమగా అందర్నీ పలకరించారు - ఎంత చక్కటి అనుభూతి - ఇప్పటికీ మదిలో అలాగే ఉంది.

ప్రొద్దున్నే అందరం కలసి మళ్ళీ ఆయన దగ్గరకు వెళ్ళాము. "ఏమి లక్కరాజుగారు రాత్రి ఎక్కడకు వెళ్ళారు, మీకోసం మూడుసార్లు కబురు చేసాను" అన్నారు. నాకు ఎవ్వరూ చెప్పలేదు అంటూ "పోనీలేండి ఇప్పుడు చెప్పండి ఆ పని" అన్నాను - "నిన్న సాయంత్రం మీరు చాలా నీరసంగా ఉన్నారు. గొంతుకూడా చాలా నీరసంగా ఉంది ఎందుకనో అడుగుదామని కబురు చేశాను" అన్నారు.

ఆహా ఏమి ఆయన ప్రేమతత్త్వం, 'ఒక సామాన్యుడి చిన్న అనారోగ్యం గురించికూడా తపనపడే ఆ యోగిపుంగవుని దృష్టిలో నేను ఉన్నానుకదా - "సాయినాథా నీకు సర్వదా కృతజ్ఞుణ్ణి" మరోసారి అనుకున్నాను. ఆ సమయంలో అక్కడ అందరికి ఊది ప్రసాదంతో సాయిపథం షిర్డీలో అచ్చువేయబడిన 'సాయిబాబా' పఠం కాగితం అందరికీ ఇస్తున్నారు - కాని నాకెందుకు ఇవ్వలేదు - అడుగుదామంటే చిన్నతనం - మళ్ళీ కొద్దిసేపాగి మళ్ళీ 'ఊది' ఇవ్వమని అడిగాను. బిస్కెట్ ప్యాకెట్ కూడ ఇచ్చారు. కాని ఆ పఠం ఈయలేదు. ఇతర సాయిబంధువులకు ఇస్తున్నారు, వారంతా గురువుగారికి దగ్గరైన వారేమో! నేను కాదేమో అనే సంకుచిత భావంకలిగింది. ఎంత విచిత్రం 15 నిమిషాలక్రితం ఆయన నా ఆరోగ్యం గురించి అడిగినప్పుడు నేనెంత దగ్గర అయ్యానో అని పొంగిపోయాను. కాని ఆ ఫోటో పేపర్ ఇవ్వనందువల్ల నేనంటే ఆయన ఆలోచనలలో సరియైన స్థానము లేదేమో అనుకున్నాను - ఎంత "అవివేకిని".

అంతకు కొన్నాళ్ళ తరువాత దత్తసాయి ఆలయంలో, మా 108వ సత్సంగ కార్యక్రమం జరిపినప్పుడు శ్రీ నారాయణరావుగారు, గుప్తాగార్లద్వారా అదే పఠం, అంత పెద్దది లేమినేషన్ చేయించి మరీనాకు పంపారు - ఆయనవద్ద టెలీపతి ఉందా! మన ఆలోచనలు ఆయనకు ఎలా తెలుస్తాయి. ఒకసారి ఆఫీసులో కూర్చొని అనుకున్నాను, "మన శివరాంగారికి, కృష్ణగారికి, సాయివరప్రసాద్ గారికి చుట్టుప్రక్కల ఎక్కడికి వచ్చినా కబురు చేస్తారు, నాకెప్పుడూ చెప్పరేం" అని నమ్మండి నమ్మకపోండి. రింగ్ అవుతుంటే ఫోన్ ఎత్తాను. శ్రీ రాధాకృష్ణగారు మరియు సాయివరప్రసాద్ గారు గుంటూరు నుంచి ఫోన్ చేశారు. "శరద్బాబూజీ" మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు, రాధాకృష్ణగారి ఇంట్లో ఉన్నారు" ఈ విధంగా మన మనస్సులోని మాటలు తెలిసిపోతుంటే ఇబ్బంది కూడాకదా. ఇలా వ్రాసుకుపోతుంటే అంతుండదు. అయినా నా పరిచయం వారితో చాలాతక్కువ ఇతర మన సాయిబంధువులతో పోలిస్తే. చివరిలో వారునాకు బోధించిన విషయం మననం చేసుకుంటూ, మీవద్ద శలవు తీసుకుంటాను.

"మనం సాయితో అనుబంధాన్ని పెంచుకోవాలి. ఎల్లప్పుడూ సాయినామం, సాయిభజన, సాయిభావన, సాయిపారాయణం చేస్తూ ఉండాలి. వీలైనంత వరకూ షిర్డీ వచ్చి సాయిని దర్శించి కాలమంతా గురుస్థాన్‌లో గడపండి - అందరిలోనూ సాయిని చూడండి. సాయి ఆశీర్వచనం పొందండి. సాయితో ఋణానుబంధాన్ని పెంచుకోండి. తగవులాటలూ, పోట్లాటలూ సాయికి గిట్టవు - ఎవ్వరినీ పల్లెత్తు మాట అనవద్దు" అని బోధించారు.

ఆయన ఏంచేయబోతున్నారో తెలియదు - ఏ ఉత్తమ సందేశం మనకు అందజేయడానికి నిరంతరం కృషిచేస్తున్నారో తెలియదు. షిర్డీ సాయి హారతులపై ఇంగ్లీషులో వారు వ్రాసిన పుస్తకం చదివాను. అంత తొందరగా పూర్తి అయ్యే పుస్తకంకాదు. హారతుల మీద అంత విశిష్టమైన పుస్తకం ఇంతవరకు రాలేదని ఖచ్చితంగా చెప్పగలను. మరికొన్ని విశిష్టమైన పుస్తకాలు సాయినాథునిపై వారు వ్రాసినవి వస్తున్నాయి అని విన్నాను. ఆ రోజు కొరకు ఎదురు చూద్దాం...

ఆయన సందేశాలతో ఆడియో క్యాసెట్స్ వచ్చినాయి. ఆయన ఏమిటి? ఏమి చేశారు? ఏమి చేయబోతున్నారు? ఆయనలోని విశిష్టత ఏమిటి? అని అడిగేవారికి, వర్తమాన, భూత భవిష్యత్తులో వారుతీసుకున్న కార్యక్రమాల్ని ఒకసారి 'జిజ్ఞాస' తో వారి రచనలను చదవండని మాత్రం చెప్పగలను.

2-1-96, తెనాలి

మీ లక్కరాజు.

## వ్రాసేకొద్దీ ఉంది చరిత్ర - రాశులకొద్దీ వాసిగల దత్త్రము

పూజ్య గురూజీ శ్రీ సాయినాథుని శరత్ బాబూజీని నేను మొట్టమొదటిగారిగా 24-11-88న దర్శించాను. 1991లో షిరిడీ వెళ్ళాను. గురూజీ తెనాలి పూజోత్సవాలకు, మరియు మారీసుపేట విగ్రహప్రతిష్టకు వచ్చినప్పటి నుండీ గురూజీతో నాకు సన్నిహితం పెరిగింది. నా దృష్టిలో బాబా, గురూజీ వేరు వేరు కాదు. ద్వంద్వ భావంలేదు. బాబా, గురూజీ ఒక్కరే అన్న నా అనుభవాన్ని ఎన్నోసార్లు అనుభవపూర్వకంగా, స్వప్న సందేశం ద్వారా కూడా పొందాను. నా దృష్టిలో నాకు జరిగే ప్రతి సంఘటన, అది చిన్నదైనా పెద్దదైనా పూర్తిగా గురూజీ అనుగ్రహంతోనే జరుగుతుందని గట్టిగా చెప్పగలను. ప్రతి రోజు నిత్య కార్యక్రమాలలో ప్రతి సంఘటన జరిగిన వెమ్మట ఒక్కసారి వెనుతిరిగి ఆలోచించిచూస్తే అది జరిగిన తీరును చూస్తే, అది గురూజీ అనుగ్రహ ప్రభావమేనని నాకు స్పష్టంగా తెలుస్తుంది.

నా దృష్టిలో నాకు ప్రతి సంఘటన గురూజీ అనుభవమే, అనుభవము కానిది ఏదీ లేదు. ఎందుకనగా, నేను గురూజీవద్దకు రాకమునుపు నా మానసిక స్థితి మనోబలము, ప్రతి సంఘటన జరిగే విధానంలో ఎంతో వ్యత్యాసం పూర్తిగా స్పష్టమవుతుంది. నా గురూజీ(నాదైవం) ద్వారా నేను పొందిన ఆణి ముత్యాలైన అనుభవాలు ఇవి.

*1) బాబా కరుణే తొలి మెట్టు* : 1990 సంవత్సరం వరకు నాకు బాబా గురించీ, గురూజీ గురించి అంత ఎక్కువగా తెలియదు. అప్పటికి నేను షిరిడీకూడ వెళ్ళలేదు. ఒకసారి బొంబాయికి కొరియర్‌లో పెద్దమొత్తం విలువగల డ్రాఫ్ట్ పంపినాను. మధ్యలో ఆ డ్రాఫ్ట్ ఎవరో దొంగిలించి ఖాళీ కవర్ డెలివరీ ఇచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే నేను బొంబాయి బయలుదేరి వెళుతూ డ్రాఫ్ట్ దొరికితే రిటన్ లో షిరిడీ వెళ్దామనుకున్నాను. బాబా కరుణించి నా డ్రాఫ్ట్ నాకు దొరికేలా చేశారు. దొంగిలించినవారు డ్రాఫ్ట్ మార్చుకొనలేక ఆ బ్యాంక్‌లో వదిలి పారేశారు. నేను బ్యాంక్‌కి వెళ్ళగా ఆ విషయం చెప్పి నా డ్రాఫ్ట్ నాకు ఇచ్చారు. వెంటనే అదే రోజు బొంబాయి నుండి షిరిడీ వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాను. మొదటిసారిగా ఆశ్రమంలో దిగాను.

*2) గురూజీ పాదస్పర్శతో పవిత్రము కాబడిన గృహం* : 1993 సంవత్సరంలో గురూజీ మా యింటికి వచ్చారు. వారి పాదస్పర్శతో భక్తిభావం ఏమాత్రంలేని మా యింటిలో గురుకృపచే పవిత్రము కాబడి సత్సంగము గురూజీచే ఆరోజు నుండి ప్రారంభింపబడింది. ఏ మాత్రం సత్సంగ వాసనలు లేని మేము సత్సంగం ఏ విధంగా నిర్వహించగలమా అని భయపడినాము. సర్వజ్ఞుడైన గురూజీ, నేను చెప్పకయే నా మనోభావాన్ని గ్రహించి, సాయివరప్రసాద్, కృష్ణమాస్టారుగార్లను సత్సంగము చేసే ఏర్పాటు చేశారు. ఆనాటి నుండి మా యింటిలోని వారందరూ ఎన్నో అనుభవాలు గురూజీ అనుగ్రహంతో పొందుతున్నాము.

మేము మా యింటికి దగ్గరలో వేరొక ఇల్లు తీసుకున్నాము. ఆ యింటిని అద్దెకు యివ్వడానికి ఎన్నో నెలలు ప్రయత్నించాము. కాని ప్రతి ఒక్కరూ కన్‌ఫర్మ్ చేసుకొని, ఎవ్వరూ చేరడానికి రాలేదు. చాలా నెలలు ఖాళీగా ఉంచి ఏమీ చేయలేక ఊరుకున్నాము. కాని గురూజీ ఆ గృహములో పాదముమోపిన రెండు, మూడు రోజులకే అద్దెకు తీసుకున్నారు.

*3) సర్వజ్ఞతకు మారుపేరు గురూజీ :* 1994 సంవత్సరం డిశంబరు 15, 16 తేదీలలో తిరువణ్ణామలైలో గురూజీ దర్శనం చేసుకున్నాను. ఆ సమయంలో గురూజీ నా మనస్సులోని మాటవిప్పి, భావాన్ని గ్రహించి, నన్ను ఆనందపరిచారు, సాయి అంటే ఓయీ! అన్న సత్యానికి నిదర్శనంగ పూండీలో - భజనలో సాయిబాబా సాయిబాబా అని చెప్పగానే పూండీ వచ్చి దర్శనమిచ్చారు.

ఈ ట్రిప్ లో గురూజీ నన్ను "నీవు ఢిల్లీ ఎప్పుడు వెళుతున్నావు?" అని అడిగారు. నేను 'నాకు ఇప్పుడు అక్కడ పనేమీ లేదని వెళ్ళటం లేదు' అని చెప్పాను. రెండు రోజుల తరువాత తెనాలి వచ్చినాను. కాని అప్పటికే నాలుగు రోజుల క్రితం నన్ను వెంటనే ఢిల్లీ బయలుదేరి రమ్మని టెలిగ్రాం తెనాలికి వచ్చివున్నది. నాకు ఈ విషయం తెనాలి వచ్చిన తరువాత తెలిసింది. సర్వజ్ఞులైన గురూజీకి తెలియనిది ఏమున్నది.

*4) అడిగిన తడవనే వరాలిచ్చే గురూజీ :* ఒకసారి మేము అద్దెకు ఉంటున్న గోడౌన్ ను ఖాళీచేయమని ఓనర్ చెప్పాడు. ఎంత వెదికినా మాకు వేరే గోడౌన్ దొరకలేదు. ఆ సమయంలో గురూజీ ఒంగోలు వెళ్ళుచూ విజయవాడలో కొద్దిసేపు ఆగారు. అప్పుడు నేను గురూజీతో మాకు ఒక గోడౌన్ కావాలని అడిగినాను. గురూజీ వెంటనే 'మీరే ఒక స్వంత గోడౌన్ కట్టించుకుంటే ప్రాబ్లం ఉండదుగదా' అన్నారు. సరిగ్గా గురూజీ ఈ అభయమిచ్చిన 20 రోజులకు నేను షిరిడీ వెళ్లాను. అదే రోజు మాకు ఒక ఖాళీస్థలము గోడౌన్‌కి పనికివచ్చే స్థలము బేరము అయినట్లుగా తెనాలి నుండి ఫోన్ వచ్చింది. కొద్దికాలంలోనే బిల్డింగ్ కూడా కట్టించాము. గురూజీ మాట బంగారుబాట అని నిరూపించే అనేక అనుభవాలు పొందినాను.

*5) సర్వజీవుల చైతన్యం సాయిబాబాగా గురూజీ నాకు ఇచ్చిన అనుభవం :* 1994 సంవత్సరం సంక్రాంతికి నేను షిరిడీ వెళ్ళి, గురూజీ అనుమతితో నేను అక్కడి నుండి త్రివేండ్రం నా వ్యాపార పని మీద వెళ్ళాను. అంతక్రితం అక్కడవున్న మా బిజినెస్ పార్టీతో విభేదాలువచ్చి వారితో వ్యాపారము ఆపివేసినాము. కానీ ఆ పార్టీ దగ్గరనుండి నేను ఊహించని విధంగా ఎంతో ఆదరణ, గౌరవ మర్యాదలు, రెస్పాన్స్ పొందినాను. ఎంతో ఆనందాన్ని అనుభవించాను. ఊహించని విధంగా వారిలో మార్పువచ్చి పరిస్థితులన్నీ మారిపోయినవి. ఈ విధంగా ఎన్నోవేల మైళ్ళ దూరంలో వున్నవారి మానసికస్థితిని మార్చగల శక్తి మా సద్గురువు శ్రీ సాయినాథుని శరత్ బాబూజీకే సాధ్యం. (మరికొన్ని ఆణిముత్యాలు తరువాయి సంచికలో).

30-6-96, తెనాలి

అద్దంకి శివరాం

## అయాచితంగా అందుకొనేదే అనుగ్రహం

డి||2-1-99 రాత్రి గం|| 1-15 నిమిషాలకు గురువుగారి సన్నిధిలో చక్కని సత్సంగం జరిగింది. గురుబంధువులు కొందరు ఉత్సాహపూరితమైన ప్రశ్నలు అడగ్గా గురువుగారు ఎంతో రసభరితంగా వాటికి సమాధానం ఇచ్చారు. గురువుగారి రాకకోసం సత్సంగ హాలులో గురుబంధువులు ఎదురు చూస్తున్నారు. గురువుగారు హాల్లోకి వచ్చి 'బాబాకు' నమస్కారం చేసి కూర్చున్నారు. ఏదో తెలియని దివ్యానుభూతిని వారు పొందుతున్నందున నోటినుండి మాట రావటం లేదెవ్వరికి. కొద్ది సేపటిదాకా నిశ్శబ్ధం అలుముకుంది.

*గురువు : ఊ చెప్పండయ్యా, అని మధురాతి మధురమైన స్వరంతో అన్నారు గురువుగారు, గురువుగారు చక్కని సదవకాశాన్ని కల్పించిన ఉపయోగించుకోకపోతే నష్టపోయేది మనమే, అడగాలి.. అడగాలి.. అనే వారేగాని అడగండయ్య అని అవకాశమిచ్చేసరికి అడక్కపోతే ఎలా? ఎవ్వరూ అడక్కపోయేసరికి ఆ అవకాశాన్ని చేజార్చుకోవటం ఇష్టంలేక కందుకూరి సుధాకర్ గారు ప్రశ్న అడిగారు.*

సుధాకర్ :సత్యాన్ని అంటిపెట్టుకో అని బాబా అన్నారు కదా! సత్యాన్ని అంటి పెట్టుకోవట మంటే ఏమిటి?

*గురువు :సత్యాన్ని అంటిపెట్టుకోవటమంటే, ఎల్లవేళలా సత్యాన్ని పలకడం. బాబా ఉన్నారు అనే సత్యాన్ని ఎల్లప్పుడూ ఎరుకలో ఉంచుకొనటమే సత్యాన్ని అంటిపెట్టుకోవడమంటే. (గురుబంధువులు అడిగిన మరి కొన్ని ప్రశ్నలు)*

*ప్రశ్న : మా సద్గురువు మీరేకదా? మీ దగ్గరనుండేకదా మాకేదైనా రావలసింది. నెమ్మదిగా, వినయంగా అడిగారు.*

*జవాబు :కొద్దిసేపు నిశ్శబ్దం... చీమచిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం అది. (బాబా ఫోటోవైపు చూపుతూ) మనందరి సద్గురువు ఆయనేకద! ఈ ప్రశ్న, సమాధానం వినేసరికి (మెరుపు, వెనుకలకు వెళ్ళాను) ఫ్లాష్ బాక్...*

*భగవాన్ సన్నిధిలో కొందరు భక్తులు, మీ ఆకర్షణశక్తేగదా ఇంతమందిని ఆకర్షించింది అనేసరికి! భగవాన్ వారినుద్దేశించి, మరి 'భగవాన్ ను ఆకర్షించిన శక్తి ఏది?' అని ఎదురు ప్రశ్న వేసారు.*

*ప్రశ్న : ఒకానొక సందర్భంలో బాబాకు తమ భక్తులు చేసుకునే సేవలో ఇతరులెవ్వరైనా మధ్యలో కల్పించుకుంటే! ఎందుకనో బాబా తమనితాము అతిగా శిక్షించుకొనేవారు. ఎందుకని? గురుబంధువులకు దీనిలోని ఆంతర్యం తెలుసుకోవాలని వారే సందర్భాన్ని వివరించారు. ఒక భక్తురాలు మశీదులో బాబాకు నడుము పిసుకుతుంటే, ప్రక్కనే ఉన్న కాకాదీక్షిత్ "మెల్లగా ఒత్తు బాబాకు నొప్పి పుడుతుంది" అన్నారు. వెంటనే బాబా అధికమైన కోపంతో లేచి మసీదులో ఉన్న స్తంభానికి సటకాను అదిమిపెట్టి తన పొట్టలోనికి గుచ్చుకున్నారు కదా! అని వివరణాత్మకమైన ప్రశ్నను వినిపించారు.*

*జవాబు :మనం బాబాని కష్టపెట్టలేము! అలాగని సుఖపెట్టలేము. ఆ భక్తురాలు అంతగట్టిగా నడుం ఒత్తుతుంటే నొప్పి పుడుతుందని కాకాదీక్షిత్ అన్నప్పుడు బాబా వెంటనే సటకాను కడుపులో గుచ్చుకున్నారు. సటకా*

కడుపులో గుచ్చుకున్నప్పుడే నొప్పిగాని, బాధగాని, అనిపించని బాబాకు నడుం పిసుకుతుంటే నొప్పిపుడుతుందా? కాకాదీక్షిత్ కు తెలియజేయడానికే బాబా ఈ చర్యను చేసారు.

ప్రశ్న : కర్మ ఫలం నశించాలంటే "షిరిడీ"లో ఉంటే సరిపోతుందా?

జవాబు : "షిరిడీ"లో ఉంటే సరిపోతుంది.

ప్రశ్న : షిరిడీలో ఉండి మనమేం చేయాలి! గురూజీ?

జవాబు : మనం బాబా కోసం వచ్చాం. మనం బాబా సన్నిధిలో ఉన్నామనే ఎరుకలో ఉంటే ఇంకా తొందరగా మన కర్మ నశిస్తుంది. బాబా మనకి చెప్పిన సాధనాలేమిటో ఒకటి చెప్పండి... అని గురువుగారు ప్రశ్నించారు. మళ్ళీ మౌనం... గురుబంధువులంతా గురువుగార్నే చూస్తుండిపోయారు. ఒక్కటి కూడా లేదుగదూ! లేనే లేదు. ఉపాసినీబాబా షిరిడీకి వచ్చిన తరువాత బాబాను నన్ను ఇక్కడ ఏమి సాధన చెయ్యమంటారని అడిగితే అందుకు బాబా ఇచ్చిన సమాధానమేమిటి? రొట్టె, కూరముక్కలు తింటూ ఖండోబా ఆలయంలో ఉండమన్నారు. అందువల్ల మనమేం చేయకున్నా, షిరిడీలో ఉన్నంత మాత్రాన మన కర్మ నశిస్తుంది.

మీరు, తిరుమలకు,తిరువణ్ణామలైకు అప్పుడప్పుడు వెళుతుంటారుకదా! కొద్ది రోజులక్కడ ఉంటారుకదా! అక్కడ కర్మ నశించదా? అని నన్ను అడగవద్దు. ఎందుకంటే నేను అక్కడకు వెళ్ళేది ప్రశాంతత కోసమేగాని, ఇక్కడి రద్దీనుంచి కొంత విశ్రాంతి కోసమేగాని, ఇతరం కోసం కాదు. అక్కడ కర్మ నశిస్తుందో లేదో నాకు తెలియదు,తెలుసుకోవాలనే జిజ్ఞాసకూడా లేదు. నాకేదైనా అనుభవం కలిగిందంటే అది బాబానే ఇస్తున్నారు.

ప్రశ్న : క్షేత్ర మహిమ బాగానే ఉంది సార్... షిరిడీలో ఎవ్వరైనా గతిస్తే మోక్షప్రాప్తి కలుగుతుందా?

జవాబు : ... చిరుదరహాసంచేసి ఊరుకున్నారు.

ప్రశ్న : సంయమనం అంటే ఏమిటి?

జవాబు : బ్యాలెన్సు

ప్రశ్న : గురూజీ... బాబా చరిత్ర చదివితే 'సాయిబాబా' అనేది బాబా అసలు పేరుకాదు అనిపిస్తుంది. అలాంటప్పుడు బాబా నామం యొక్క ప్రాధాన్యత ఏమిటి?

జవాబు : నీ కెందుకొచ్చింది ఈ "లా పాయింట్" బాబాని బాబా అని పిలిస్తే నీకేంటి అభ్యంతరం. నిన్నెవరైనా నీ పేరేమిటని అడిగితే నా పేరు ఫలానా! అని అంటావా లేదా? అలాగే బాబా కూడా ఆయన దగ్గరకు వచ్చిన కమీషన్‌తో నా పేరిదని చెప్పలేదు. వీరంతా నన్ను 'సాయిబాబా' అని అంటారు. దీనికి నిదర్శనంగానే ఒక భక్తుడు ఒకసారి రైల్లో బాబా నామాన్ని చెప్తూవున్నాడు. మరుసటి రోజా భక్తుడు మశీదులోకి ప్రవేశిస్తుండగానే 'వీడు నన్ను రాత్రంతా నిద్రపోనీయకుండా పిలుస్తూనే ఉన్నాడు' అన్నారు బాబా అతన్ని ఉద్దేశించి. అంటే అతను రైల్లో కూర్చొని బాబా..బాబా.. అని అంటుంటే మశీదులో కూర్చున్న బాబాకెలా

తెలిసింది. ఆయన పలికారుగదా! మన మందరం కూడా బాబాని బాబాగానే పిలుద్దాం. ఆయన పలుకుతారు. ఇక్కడ బాబా నామం అంటే, బాబా, బాబా అని పలకడమే.

ప్రశ్న : అంటే బాబా నామమేగదా ! మనకి మంత్రము!

జవాబు : నేను మంత్రాల గురించి, ఉపదేశాల గురించి మాట్లాడటంలేదు. "రామ" అనేది మంత్రమెలా అయ్యింది. అంటే అందులో బీజాక్షరాలు మొదలగునవి అది మంత్రం. ఉపదేశమంటే గురువు తన తపఃశక్తిని ధారపోసి దానిని శిష్యుని చెవిలో చెబుతాడు. 'బాబా,బాబా' అనేది మంత్రంకాదు, ఉపదేశంకాదు, సాయిబాబా... సాయిబాబా...అంటే ఆయన్ను పిలవటమే.

ప్రశ్న : గురూజీ, సమర్థత అనేది శ్రద్ధవల్ల వస్తుందా? లేక అనుభవం వల్ల వస్తుందా?

జవాబు : నవ్వులు...నవ్వులే...నవ్వులు... ఈ రెండూ ఒకే విషయమునకు సంబంధించినవి ఎలా అవుతాయి. శ్రద్ధ అనుభవంద్వారా, సమర్థత వస్తుంది. ఏమి ప్రశ్నయ్యా.

ప్రశ్న : గురూజీ.. పూర్వజన్మ కర్మఫలం ఉంటుందా?

జవాబు: ఉంటుంది... కొద్దిపాటి నిశ్శబ్దం తరువాత... తప్పకుండా ఉంటుంది. తల్లిదండ్రులు చేసిన కర్మలననుసరించి మనకు ప్రతిఫలం ఉంటుంది అనేది కర్మ సిద్ధాంతం. అంటే మనం పాపం చేస్తే ఒక రకమైన ఫలితం, పుణ్యం చేస్తే వచ్చే ఫలితం వేరువేరుగా ఉంటాయి. దీనిని కర్మ సిద్ధాంతమని అంటారు. ఇది ఒక విధానమైన సిద్ధాంతం. ఒక వస్తువు జారితే క్రింద పడుతుంది. ఇది న్యూటన్స్ లా, భూమియొక్క ఆకర్షణ శక్తివల్ల ఆ వస్తువు క్రింద జారిపడుతుంది. ఇది ఒక సిద్ధాంతం. కానీ ఒక వస్తువును పైనుంచి క్రిందకు పడేసి మధ్యలో పట్టుకుంటే దానినేమంటారు? మామూలుగా కర్మఫలాన్ని అనుభవించ వలసిందే. కాని సద్గురు సాయిబాబా అయితే మాత్రం ఆకర్మను నశింపజేస్తారు. అనుభవించకుండా ఆ కర్మనుండి మనలను కాపాడుతారు. అది ఆయన బాధ్యత.

ప్రశ్న : గురువుగారి 'గ్రేస్' (అనుగ్రహము) పొందాలంటే ఏమి చేయాలి సార్?

జవాబు : ఏమీ చేయకుండా పొందేదే గ్రేస్ అవుతుందికాని, ఏదో చేస్తే పొందేది 'గ్రేస్' ఎలా అవుతుంది. ఏమీ చేయకుండా, ఉచితంగా, అనాయాచితంగా పొందేదే 'గ్రేస్' అవుతుంది. నీవు వ్రాసిన పరీక్షలో 50 మార్కులకు సమాధానాలు వ్రాసిన తరువాత నీకు 50 మార్కులు వస్తే అది గ్రేస్ ఎలా అవుతుంది. 20 మార్కులకు మాత్రమే సమాధానాలు వ్రాసి 50 మార్కులు పొందితే 30 మార్కులు గ్రేస్ అవుతాయి. ఏమీ చేయకుండా పొందిందే 'గ్రేస్' అవుతుంది. గురువు అనుగ్రహం పొందాలంటే నీవేమీ చేయనక్కరలేదు. ఆయనకు నీమీద ప్రేమకలిగితే 'గ్రేస్' దానంతటదే వస్తుంది. ఉదాహరణకి నాకు నీమీద చాలా ఇది ఉండి ఒక పదిరోజులు షిరిడీలో ఉండమన్నాననుకో దీనికి నీవేమంటావు? నాకు అంత 'గ్రేస్' వద్దు అని అంటావు కదా? అన్నారు

అందరూ గొల్లుమని కొద్దిసేపు హాయిగా నవ్వుకున్నారు.

ప్రశ్న : సమాజంలో 'సోషల్ ఇన్‌జస్టిస్' జరుగుతుందని ప్రశ్న వేయబోతుంటే.

*జవాబు : ఆ ప్రశ్న పూర్తి కాకుండానే గురువుగారు, వేరేవాళ్ళ గురించి మనకెందుకయ్యా? నిజంగా మీరు సమాజ శ్రేయస్సునే కోరుతున్నారా? నీకు ఉద్యోగంలో ప్రమోషన్ కావాలి! మీ పిల్లవాడికి మెడికల్ కాలేజీలో సీటు, మీ అమ్మాయికి మంచి హోదా కలిగిన సంబంధం, మీ ఇంటి సమస్యలు ఇన్ని పెట్టుకొని 'సోషల్ ఇన్‌జస్టిస్' గురించి మాట్లాడుతావా? గాంధీగారు కొల్లాయి కట్టారు. అంటే భారతీయుల్లో చాలామందికి కట్టుకోవడానికి బట్టలు లేవు. ఇది ఆయన సొంత సమస్యగా భావించాడు కాబట్టే కొల్లాయి ధరించాడు. గౌతముడు రాజ్యంలో ఉన్న దుఃఖాన్ని చూచి వనాలకు వెళ్ళాడు. అది తన సమస్యగా భావించాడు కాబట్టే వెళ్ళాడు. నీవుకూడా అలా భావిస్తున్నావా? సమాజ శ్రేయస్సు దృష్ట్యా, లేదే నీకు నీ పిల్లవాడూ, భార్యా, ఇల్లు, ముఖ్యంగా భావిస్తున్నావు, అలాంటప్పుడు 'సోషల్ ఇన్‌జస్టిస్' గురించి మాట్లాడటం, ఎంతవరకు భావ్యం - ఆలోచించండి, పైకొక మాట, మనస్సులో వేరొక భావమా?*

(నా వ్యాసాన్ని ఈ రూపంలో తెలియపరచుటకు చి. సాయి శ్రీనివాస్, ఎంతగానో సహకరించాడు)

రేపల్లె　　　　　　　　　　　　　　　　　　　　　డా|| ఎస్. సాయివరప్రసాదరావు

(శరణాగతి విషయంగా వచ్చేవారం మరికొన్ని విషయాలు తెలుసుకుందాం.)

